## భక్తులకు తలంబ్రాలు, ప్రసాదం అందాలి

**శ్రీరామ నవమి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్**

కల్యాణ మండపం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలం, మార్చి 19 : శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం వచ్చే ప్రతీ భక్తునికి స్వామివారి తలంబ్రాలు, ప్రసాదం అందించే విధంగా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. భద్రాచలంలో శ్రీరామ నవమి ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ పరిశీలించడంతోపాటు పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇరిగేషన్ శాఖ ద్వారా కల్యాణ మండపంలోని భక్తులకు, మండపం బయట ఉండే భక్తులకు పాలిహౌజ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కరకట్ట పక్కన తక్కువ ఖర్చుతో భక్తులు బస చేయడానికి క్యాంపు పైడ్ హౌజ్‌లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు బసచేసే ప్రాంతం, కల్యాణ మండపానికి వెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని, కల్యాణం తిలకించడానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం టాయిలెట్లు, వాష్ రూములు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్‌రావు, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఎదగాలి: కలెక్టర్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 19: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఎదగాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ, ఆలింకో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆనందఖని ఉన్నత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత పరికరాలు, ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు సహాయక పరికరాల కోసం ఆలింకో స్క్రీనింగ్ క్యాంపును గత ఏడాది ఆగస్టు 24న నిర్వహించినట్లు గుర్తుచేశారు. మొత్తం 387 మంది పిల్లలకు గాను 288 మంది పిల్లలకు వివిధ రకాల ఉచిత ఉపకరణాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. డీఈవో వెంకటేశ్వరచారి, జిల్లా సమ్మిళిత విద్య కో ఆర్డినేటర్ సైదులు, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనీనా, ఏఎంవో నాగ రాజశేఖర్, హెచ్ఎం మంగీలాల్, ఆలింకో ఇన్‌చార్జి సురుష, మోహిత్ పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయురాలిని సన్మానించిన కలెక్టర్

టేకులపల్లి, మార్చి 19: మండల స్థాయి బాల మేళాలో 'బెస్ట్ స్కూల్'గా బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎంపికైంది. కొత్తగూడెంలోని విద్యా వనరుల కేంద్రంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి బాలమేళాలో బొమ్మనపల్లి ప్రధానోపాధ్యాయురాలు ఎం.జ్యోతిరాణిని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సన్మానించి, ప్రశంసాపత్రం అందించారు. డీఈవో వెంకటేశ్వరచారి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ నాగరాజ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు ఎత్తివేయాలి'

పాల్వంచ, మార్చి 19: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంక్షలను ఎత్తివేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వర్క అజిత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పాల్వంచలో బుధవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేమాతరం ఉద్యమం మొదలుకొని తెలంగాణ ఉద్యమం వరకు జరిగిన పోరాటాలకు ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా ఉందని గుర్తుచేశారు. అయితే, ఇప్పుడు రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడో గ్యారెంటీ కింద నిర్బంధాన్ని తెచ్చిందని, దానిని ఉస్మానియా యూనివర్సిటీలో అమలుచేస్తోందని విమర్శించారు. సంఘం బాధ్యులు గుండాల సుజన్, వంశీ, కమల్ రాజ్, వినయ్ పాల్గొన్నారు.

## 'సొసైటీ గోడౌన్ల నిర్మాణానికి స్థలం కేటాయించాలి'

పాల్వంచ/ పాల్వంచ రూరల్, మార్చి 19: పాల్వంచ సొసైటీ పరిధిలో వివిధ గోడౌన్ల నిర్మాణానికి స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, స్థానిక సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు జిల్లా పాల్వంచ సొసైటీ పాలకవర్గ సభ్యులతో కలిసి వెళ్లి కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువుల పంపిణీలు, ధాన్యం కొనుగోళ్ల కోసం అవసరమైన గోడౌన్ల కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. కాంపెల్లి కనకేష్ పటేల్, బూడగం రాంమోహన్‌రావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, జరబన సీతారాంబాబు, మైనేని వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి మధుసూదన్‌రావు, భూక్యా కిషన్, నిమ్మల సువర్ణ, సీఈవో లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, పైడిపల్లి మహేష్, శాంతివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కేఓసీ భూనిర్వాసితుల ధర్నా

ఇల్లెందు, మార్చి 19: కేవోసీ 2, పిట్ 2,3లలో సాగు భూములు కోల్పోయిన తమకు హైకోర్టు తీర్పు ప్రకారం భూమి నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ భూనిర్వాసితులు బుధవారం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. భూనిర్వాసితుల సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాస్, ఈసం నర్సింహారావు, సూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్, దొడ్డ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రతిభ'కు సన్మానం

ఇల్లెందు, మార్చి 19: ఇల్లెందు ఎస్సై సందీప్ కుమార్ ప్రతిభావంతుడిగా నిలిచారు. ఇటీవల వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో మంచి ర్యాంక్ సాధించారు. ఆయనను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ బుధవారం సన్మానించారు. నాయకులు జెకె.శ్రీను, సిలివేరి సత్యనారాయణ, రంగనాథ్, జాఫర్ హుస్సేన్, పరుచూరి వెంకటేశ్వర్లు, అబ్దుల్ నబి పాల్గొన్నారు.

## కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

ఇల్లెందు రూరల్, మార్చి 19: సింగరేణి ఉద్యోగులు/కార్మికుల వారసులకు కారుణ్య నియామక ఉత్తర్వులను ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్య బుధవారం తన కార్యాలయంలో అందజేశారు. అధికారులు రామస్వామి, జీవీ మోహన్ రావు, మధుబాబు, సాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు
వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ప్రాణాలు తీస్తున్న 'సింగరేణి'

- **అధికారులపై జనాగ్రహం**
- **రోడ్డెక్కి నిరసన**

**కొంచెం ఎక్కువ మోతాదులో విషం పుచ్చుకున్న మనిషికి ఏమవుతుందో తెలుసు కదా.. వెంటనే ప్రాణం పోతుంది. అదే విషాన్ని రోజూ కొంచెం కొంచెంగా (స్లో పాయిజన్ లాగా) తీసుకుంటే.. కొన్ని నెలలు/సంవత్సరాల తర్వాత ప్రాణం పోతుంది. తమ ప్రాణాలను స్లో పాయిజన్‌లాగా సింగరేణి అధికారులు బలి తీసుకుంటున్నారని మండలంలోని దాస్‌తండా పంచాయతీ వాసులు తీవ్ర ఆగ్రహావేశంతో ఉన్నారు.**

టేకులపల్లి, మార్చి 19: సింగరేణి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, రెండేళ్లుగా తమ 'ప్రాణాలు' తీస్తున్నారని దాస్‌తండా పంచాయతీ వాసులు అంటున్నారు. ''మా ప్రాణాలకు మీ దృష్టిలో ఏమాత్రం విలువ లేదా..?'' అని సూటిగా ప్రశ్నిస్తూ బుధవారం రోడ్డెక్కారు. కేవోసీ బొగ్గు రవాణా వాహనాల రాకపోకలను అడ్డుకునేందుకు నడి రోడ్డుపై టెంట్ వేసి, దాని కింద కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. వీరు ఇంత తీవ్రంగా సింగరేణి అధికారులపై మండిపడడానికి, ఆందోళనకు దిగడానికి తగిన కారణాలే ఉన్నాయి.

దాస్‌తండా పంచాయతీలోని రేగులతండా, దాస్‌తండా గ్రామాల వద్ద రోడ్డు విస్తరణ పనులు రెండేళ్ల క్రితం మొదలయ్యాయి. అవి ఇప్పటికీ పూర్తి కాలేదు. మధ్యలోనే ఆగిపోయాయి. ఈ రోడ్డు మీదుగానే మండలంలోని కోయగూడెం ఉపరితల గని(కేవోసీ) నుంచి వివిధ ప్రాంతాలకు బొగ్గు రవాణా వాహనాలు (లారీలు, టిప్పర్లు) రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడే రెండు రకాల సమస్యలు ఏర్పడుతున్నాయి. మొదటి సమస్య– ఇప్పటికే అడుగడుగునా గుంతలమయంగా మారిన ఈ రోడ్డు.. బొగ్గు వాహనాల నిరంతర రాకపోకలతో మరింతగా దెబ్బతింటున్నది. వాహనాలు వెళ్తున్నప్పుడు రోడ్డు పైని దుమ్మూ ధూళి పైకి లేచి, చుట్టుపక్కల గ్రామాల్లోని ఇళ్ల లోపలికి చేరుతున్నది. రెండవ సమస్య– రోడ్డుపై గుంతల మీదుగా బొగ్గు వాహనాలు వెళ్తున్నప్పుడు.. అవి కుదుపులకు లోనవుతున్నాయి. అప్పుడు వాటిలోని బొగ్గు నుంచి దుమ్మూ ధూళి (అప్పుడప్పుడు బొగ్గు పెళ్లలు కూడా).. గాలి ద్వారా దాస్‌తండా, రేగులతండా తదితర గ్రామాల్లోని ఇళ్లలోకి చేరుతున్నది. ఇలా రెండు రకాలుగా వస్తున్న ఈ దుమ్మూ ధూళితో గాలి కలుషితమవుతున్నది. ఈ గ్రామాల్లోని ప్రజల శరీరాల్లోకి చేరుతున్నది. ఫలితంగా, ఇక్కడి ప్రజలు ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నారు.

రోడ్డుపై అడ్డంగా టెంట్ వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

### పరిష్కారంపై శ్రద్ధ ఏదీ..?

తమ సమస్యల పరిష్కారంపై సింగరేణి అధికారులకు ఏమాత్రం శ్రద్ధ లేదని బాధిత ప్రజలు మండిపడుతున్నారు. వీరి సమస్యకు రెండు పరిష్కారాలున్నాయి. ఒకటి– రోడ్డు విస్తరణ పనులను పూర్తిచేయడం. రెండు– రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యేంత వరకూ ఈ మార్గంలో నిరంతరం రాకపోలు సాగిస్తున్న బొగ్గు రవాణా వాహనాలను నిలిపివేయడం. ''మీకు మీ వ్యాపారమే (బొగ్గు రవాణా) ముఖ్యమా..? ఊపిరితిత్తుల వ్యాధులతో మా ఆరోగ్యం క్రమ క్రమేణా క్షీణిస్తున్నా పట్టించుకోరా..? మీ దృష్టిలో మా ప్రాణాలకు ఏమాత్రం విలువ లేదా..? మీ నిర్లక్ష్యానికి మేమెందుకు బలి కావాలి..?'' అని, సింగరేణి అధికారులను బాధిత ప్రజలు రెండేళ్ల నుంచి గొంతెత్తి ప్రశ్నిస్తున్నారు. సమాధానం ఇవ్వాలని నిలదీస్తున్నారు. అయినప్పటికీ అధికారుల్లో ఏమాత్రం స్పందన లేదు. దీంతో విసిగివేసారిన ఈ బాధితులు.. గుంతలమయంగా మారిన ఆ రోడ్డుపై బుధవారం టెంట్.. దాని కింద కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. బొగ్గు రవాణా వాహనాలను రెండు గంటలపాటు అడ్డుకున్నారు. పోలీసులు నచ్చజెప్పడంతో టెంట్ తొలగించి వెళ్లిపోయారు. ఇక్కడి బాధిత ప్రజలు ఇలా ఆందోళనకు దిగడం ఇదే మొదటిసారి కాదు..! సింగరేణి అధికారులు ఇకనైనా స్పందించకపోతే.. ఇదే చివరి సారి కూడా కాబోదు..!!

## మర్కోడు జీసీసీలో ఆకస్మిక తనిఖీలు

ఆళ్లపల్లి, మార్చి 19: ఆళ్లపల్లి మండలం మర్కోడు జీసీసీ (రేషాన్‌షాపు)ను అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీసీసీ సెల్స్‌మేన్ విధుల్లో లేకపోవడం, ఫోన్‌కి స్పందించకపోవడంతో గ్రామస్తుల సమక్షంలో అధికారులు ఆ తాళాలను పగలగొట్టించారు. మర్కోడు జీసీసీ సెల్స్‌మేన్ సరిగా రావడం లేదని, అతడి బంధువులతో రేషన సప్లయి చేయిస్తున్నాడని గ్రామస్తులు గతంలోనే ఫిర్యాదు చేశారు. అయితే, విచారణకు రావాలంటూ జిల్లా అధికారులు అతడికి పలుమార్లు సమాచారం పంపినప్పటికీ అతడు స్పందించలేదు. దీంతో బుధవారం గ్రామానికి వచ్చిన అధికారులు.. గ్రామస్తుల సమక్షంలో రేషన్‌షాపు తాళాలు పగులగొట్టారు. దుకాణంలో ఉన్న బియ్యం స్టాక్‌ను, రేషన్‌దారులకు చేసిన సప్లయి చేసినట్లు పొందుపర్చిన రికార్డులను పరిశీలించారు. సుమారు 40 క్వింటాళ్లకు పైగా బియ్యం లెక్కల్లో తేడా వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## సఫాయిబస్తీ యూపీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 19: కొత్తగూడెం పట్టణంలోని సఫాయిబస్తీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)ని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూపీహెచ్‌సీలో మందుల స్టాక్, రికార్డులు, సిబ్బంది హాజరు పట్టిక వంటివి పరిశీలించారు. అలాగే, కుష్ఠు నిర్మూలన కార్యక్రమం కోసం ప్రచారం నిర్వహించాలంటూ పారామెడికల్ సిబ్బందికి సూచించారు. అందరూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## చదువే గొప్ప సంపద: ఎస్‌వోటూ జీఎం

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 19: ప్రతి ఒక్కరికీ చదువే గొప్ప సంపద అని కొత్తగూడెం ఏరియా ఎస్‌వోటూ జీఎం కోటిరెడ్డి పేర్కొన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య ద్వారానే సమస్తమూ సమకూరుతుందని అన్నారు. చక్కగా చదివి పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని, తల్లిదండ్రులను కలలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. నిరుడు సాధించిన 96 శాతం ఉత్తీర్ణతకంటే ఈసారి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షల సామగ్రిని అందించారు.

## 'గ్రంథాలయ' అభ్యర్థుల్లో ఇద్దరికి ఉద్యోగాలు

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 19: గ్రంథాలయంపై ఆధారపడి చదివిన అభ్యర్థుల్లో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఇటీవల విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో ఈ ఇద్దరూ మెరుగైన ర్యాంకులు కైవసం చేసుకున్నారు. బారి లక్ష్మణ్‌యాదవ్, శ్రీలత యాదవ్‌లు పోటీ పరీక్షల కోసం మూడేళ్లుగా కొత్తగూడెం గ్రంథాలయంలో తర్ఫీదు పొందుతున్నారు. టీజీపీఎస్‌సీ ఇటీవల వెల్లడించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల ఫలితాల్లో లక్ష్మణ్‌యాదవ్ ఓపెన్ కేటగిరీలో రాష్ట్రస్థాయిలో 142వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 18వ ర్యాంకు సాధించాడు. శ్రీలత యాదవ్ కూడా ఓపెన్ కేటగిరీలో రాష్ట్రస్థాయిలో 25వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 35వ ర్యాంకు సాధించారు. వీరిద్దరూ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అయితే, వీరి ఫలితాలు తమ గ్రంథాలయానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చాని గ్రంథాలయ కార్యదర్శి అర్జున్ హర్షం వ్యక్తం చేశారు.

## 'కూలీలకు పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలి'

పాల్వంచ రూరల్, మార్చి 19: పనులు చేసే ప్రదేశాల్లో ఎండ వేడిని తట్టుకునేందుకు ఉపాధి హామీ కూలీలకు టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో విద్యాచందన ఆదేశించారు. మండలంలోని కేశవాపురం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆమె పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం ఏడు గంటలకే పనులకు రావాలని, రోజుకు కనీసం రూ.300 వేతనం పొందేలా పనుల కొలతలు వేసుకోవాలని సూచించారు. పనుల వివరాలను జాబ్ కార్డుల్లో పొందుపర్చుకోవాలన్నారు. అనంతరం పంచాయతీలో జరుగుతున్న రోడ్లు, ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఏపీవో రంగా, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## తడి చెత్త, పొడి చెత్తను వేరుచేయాలి: కమిషనర్

పాల్వంచ, మార్చి 19: పట్టణ ప్రజలందరూ తమ ఇళ్లలోని చెత్తను తడి చెత్తగా, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలని పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరుచేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పబ్లిక్ టాయిలెట్ వినియోగించడం వంటి అంశాలపై పట్టణ ప్రజలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పర్యావరణ ఇంజినీర్ ఫరీద్, సీవో సుగుణ, ఆర్పీలు, జవాన్లు పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

**ఉల్వనూరు గిరిజన బాలికల పాఠశాల పరిశీలనలో ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్**

పాల్వంచ రూరల్, మార్చి 19: ఉన్నతమైన విద్య, ఉద్యోగ అవకాశాల కోసం ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్ మధుకర్ సూచించారు. మండలంలోని ఉల్వనూరు ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, బోధనా సిబ్బందితో మాట్లాడారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకూడదని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు పటిష్టమైన ప్రణాళిక ద్వారా విద్యను పూర్తిస్థాయి బలోపేతం చేయాలని బోధనా సిబ్బందికి సూచించారు. విద్యార్థినులు తరగతి గదుల్లో ఇంగ్లిషులో మాట్లాడేలా, లెక్కలపై ప్రత్యేక దృష్టి పెట్టేలా, కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో బేసిక్స్ నేర్చుకునేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను, జీకే పుస్తకాలను అందించారు. పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

అశ్వారావుపేట, మార్చి 19: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాలు.. మండలంలోని వినాయకపురం నుంచి ఐదు క్వింటాళ్ల బియ్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఎస్సై యయాతి రాజు బుధవారం అడ్డుకున్నారు. రేషన్ బియ్యం సహా వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ దారం చిన శ్రీనివాస్‌పై, యజమాని ఆదివిష్ణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. బియ్యాన్ని రెవెన్యూ అధికారులు అప్పగించారు.

## ప్రమాదంలో వ్యవసాయ రంగం: బాగం

పాల్వంచ రూరల్, మార్చి 19: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయ రంగం ప్రమాదంలో పడిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆందోళన వ్యక్తం చేశారు. ముమ్ముందు మరింత సంక్షోభంలో కూరుకుపోతుందని విమర్శించారు. మండలంలోని జగన్నాథపురంలో బుధవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ, రైతుభరోసా పథకాలు సంపూర్ణంగా అమలు కాలేదని ఆరోపించారు. సాబిర్‌పాషా, నరేంద్ర కుమార్, విశ్వనాథం, వెంకటేశ్వర్లు, నరాటి ప్రసాద్ పాల్గొన్నారు.

## పన్నుల సంపూర్ణ వసూళ్లే లక్ష్యం

అశ్వారావుపేట టౌన్, మార్చి 19: అశ్వారావుపేట మున్సిపాలిటీలో పనులను సంపూర్ణంగా వసూలు చేయడమే లక్ష్యంగా బిల్ కలెక్టర్లు కృషి చేయాలని కమిషనర్ కె.సుజాత కోరారు. పన్నుల వసూళ్లపై వారితో ఆమె బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పన్నులను సంపూర్ణంగా వసూలు చేసేందుకు అవసరమైతే తోటి సిబ్బంది సహాయం తీసుకోవాలన్నారు.

## 30 నుంచి రామయ్య నిత్య కల్యాణాలు నిలిపివేత

భద్రాచలం, మార్చి 19: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 30న శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో, ఈ నెల 30 నుంచి ఏ ప్రిల్ 12వ తేదీ వరకు స్వామి వారికి నిత్య కల్యాణాలు ఉండవు. దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. భక్తులు గమనించాలని కోరారు.

## కీచక ఉపాధ్యాయుడిపై కేసు

టేకులపల్లి, మార్చి 19: బాలికపాలిట కీచకుడిగా మారిన ఉపాధ్యాయుడిపై కేసు నమోదైంది. బోడు ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. మండలంలోని గంగారం పంచాయతీ సంపత్‌నగర్ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలికను అక్కడి వార్డెన్ (హిందీ టీచర్) లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని ఆ బాలిక తన తల్లికి తెలిపింది. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో ఆ కీచక ఉపాధ్యాయుడిపై కేసు నమోదైంది.

## రోడ్డును మరమ్మతు చేయాలని ధర్నా

మణుగూరు టౌన్, మార్చి 19: మణుగూరు–ఏటూరి నాగారం ప్రధాన రహదారి.. బయ్యారం అడ్డ రోడ్ వరకు గుంతలమయంగా మారింది. మణుగూరు ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ లైటింగ్ లైట్లు కూడా సరిగ్గా పనిచేయడం లేదు. ఈ రెండు సమస్యలను పరిష్కరించాలన్న డిమాండుతో మణుగూరు సురక్ష బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు బుధవారం ధర్నాకు దిగారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కుర్రి నాగేశ్వరరావు (మండల కన్వీనర్), కుంట లక్ష్మణ్, రమేష్, నరసింహారావు, యాదగిరి గౌడ్, నరసింహారావు పాల్గొన్నారు.

## 'మత సామరస్యానికి ప్రతీకలు ఇఫ్తార్ విందులు'

రామవరం, మార్చి 19: ఇఫ్తార్ విందులు.. మత సామరస్యానికి ప్రతీకలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు పేర్కొన్నారు. జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో స్థానిక మసీద్ ఖుబాలో బుధవారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ముస్లింలతో మాట్లాడారు. కఠోరమైన ఉపవాసాలు మనిషిలో న్యాయం, ధర్మం, ఆప్యాయత అనురాగాలు పెంపొందిస్తాయని అన్నారు. అబ్దుల్ బాసిత్, ఎండీ రజాక్, శంకర్, గూడెల్లి యాకయ్య, షమీం, ఆలం, సోను, భాయ్, షబ్బీర్, రబ్బానీ, కరీం పాల్గొన్నారు.

## రేపు పంచాయతీ వేలం పాటలు

భద్రాచలం, మార్చి 19: భద్రాచలంలో వివిధ రకాల పనులకు శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆశీల వసూలు, సంత, పార్కింగ్ ఫీజు, పంచాయతీ దుకాణాలకు వేలం పాటలు ఉంటాయని వివరించారు. ఆసక్తిగల గిరిజనులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## గిరిజన మ్యూజియాన్ని అలంకరించాలి

భద్రాచలం, మార్చి 19: ఐటీడీఏ కార్యాలయం ఆవరణలోగల గిరిజన మ్యూజియాన్ని శ్రీరామ నవమి నాటికి అందంగా అలంకరించాలని సంబంధిత అధికారులతో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ చెప్పారు. ఈ మ్యూజియాన్ని బుధవారం సందర్శించారు. బోటింగ్ ప్రదేశాలను, బాక్స్ క్రికెట్ గ్రౌండును, మ్యూజియం లోపల కొనసాగుతున్న పెయింటింగ్ పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. శ్రీరామ నవమికి వచ్చే భక్తులు తప్పనిసరిగా గిరిజన మ్యూజియాన్ని సందర్శించేలా సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. అందుకే, ఏ ఒక్క పని కూడా మిగలకుండా అన్నీ పూర్తి చేయాలన్నారు. మ్యూజియంలో వాష్ రూమ్స్, టాయిలెట్స్‌కు ఏమైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే చేయించాలన్నారు. సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్‌రాజు, ఈఈ మణెమ్మ, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, ఏసీఎంవో రమణయ్య, డీఈ హరీష్, డీఎస్‌వో ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.